



లంబసింగిలో గుడారాలు

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఎన్నికల్లో గెలుపునకు ప్రతీ ఒక్కరు సైనికుల్లా పనిచేయాలి

- కాంగ్రెస్ పాలన గురించి ఇంటింటికీ వివరించండి
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు
- కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని భరోసా
- వైసీపీ, సీఎం జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు
- ప్రత్యేక హోదా గురించి నోరు విప్పలేదని ధ్వజం
- రాష్ట్రానికి మూడు రాజధానులన్న జగన్.. ఒక్క రాజధాని కూడా లేకుండా చేశారని ఎద్దేవా





అనకాపల్లి, అల్లూరి జిల్లాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న షర్మిల/ కాంగ్రెస్ శ్రేణులకు షర్మిల అభివాదం

అనకాపల్లి /కొత్తూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "మరికొద్ది రోజుల్లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా పనిచేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం" అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. పీసీసీ పగ్గాలు చేపట్టిన తరువాత జిల్లాల పర్యటన ప్రారంభించిన ఆమె బుధవారం సాయంత్రం అనకాపల్లి వచ్చారు. రింగ్‌రోడ్డులోని ఒక ప్రైవేటు కన్వెన్షన్ హాలులో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అధికార వైసీపీ, ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.



షర్మిలకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్, ఏపీ సీపీఎస్ఈఏ నాయకులు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, అటు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నప్పుడు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని, మళ్లీ వైఎస్ వంటి నాయకుడు రాష్ట్రానికి కావాలని షర్మిల అన్నారు. పేదలకు అండగా వుండే ప్రభుత్వం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం వుందని, ఇందుకోసం ప్రతిఒక్కరూ కష్టపడాలన్నారు. ఇంటింటికీ వెళ్లి గతంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలతోపాటు పార్టీ విధివిధానాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఇప్పుడున్న వైసీపీ ప్రభుత్వానికి, రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడాను తెలియజేయాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వం బీజేపీకి ఎలా అమ్ముడుపోయిందో చెప్పాలన్నారు. ఈ రాష్ట్రంలో బీజేపీ ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే సీటు కూడా గెలవకుండా ఏపీలో పెత్తనం ఎలా చెలాయిస్తున్నదో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కింద నుంచి పైస్థాయిలో వరకు పార్టీకి కమిటీలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. సామాజిక మాధ్యమాలు చాలా క్రియాశీలకంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వాటిని వినియోగించుకుంటూ పార్టీని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని షర్మిల అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేస్తే రాష్ట్రంలో అధికారంలోకి రాగలమని ప్రతి కార్యకర్త గుర్తించాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారంటే రాష్ట్రంపై కాంగ్రెస్ పార్టీకి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవాలన్నారు. అందువల్ల ప్రత్యేక హోదా ... మిగతా 8వ పేజీలో

పర్యాటక ప్రాజెక్టులు ప్రైవేటుపరం!

- లీజుకు కట్టబెట్టాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయం

- విశాఖపట్నం, అరకులోయ, అనంతగిరి, లంబసింగి ప్రాంతాల్లో ఉన్న రిసార్టులు, హోటళ్లు అన్నీ కూడా...
- ప్రభుత్వ ఖజానాకు గండి
- ప్రస్తుతం ఏడాదికి రూ.28 కోట్లు ఆదాయం
- రూ.15 కోట్లకే ఇస్తామని టెండర్ల ఆహ్వానం
- అస్మదీయులకు అప్పగించేందుకు వైసీపీ సర్కారు పన్నాగం?



అరకులోయలో హిల్ రిసార్టు



రేవుపోలవరంలో క్యాంటీన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక ఆస్తులన్నీ ప్రైవేటుకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదికి సుమారు రూ.28 కోట్ల ఆదాయం ఇస్తున్న వాటిని కేవలం రూ.15 కోట్లకే ఇచ్చేస్తామని ప్రకటన జారీ చేసింది. పైగా ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న వారికి తామే జీతాలు ఇచ్చుకుంటామని, ప్రైవేటు పార్టీలకు సంబంధం లేదని చెబుతోంది. అంటే లీజు ద్వారా వచ్చే రూ.15 కోట్లలో రూ.8 కోట్లు జీతాలకు తీసేస్తే ప్రభుత్వానికి మిగిలేది రూ.7 కోట్లు మాత్రమే. ఎక్కడైనా నష్టాలను పూడ్చుకొని, లాభాలు పొందడానికి ప్రైవేటుకు అప్పగిస్తారు. కానీ ఇక్కడ రూ.28 కోట్ల ఆదాయాన్ని ఇచ్చే హోటళ్లు, రిసార్టులను రూ.15 కోట్లకే ఇచ్చేయడానికి నిర్ణయించారు. ఈ చర్యల ద్వారా ఏడాదికి రూ.13 కోట్ల నష్టం. ఇది టెండర్ దక్కించుకున్న వారికి లాభం. అధికార పార్టీకి అస్మదీయులైన వారికి లబ్ధి చేకూర్చడానికే ఎన్నికల ముందు ఈ నిర్ణయం తీసుకుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విశాఖపట్నం జిల్లా అంటేనే పర్యాటకం. ఇక్కడికి రోజుకు సగటున 50 వేల మంది పర్యాటకులు వస్తుంటారు. వీరంతా వసతి కోసం పర్యాటక శాఖ నిర్మించిన రిసార్టులు, హోటళ్లనే మొదట కోరుకుంటారు. అక్కడ రూములు దొరక్కపోతేనే ప్రైవేటు హోటళ్లకు వెళతారు. విశాఖపట్నం, అరకులోయ, అనంతగిరి, లంబసింగి తదితర ప్రాంతాల్లో పర్యాటక శాఖ నిర్మించిన హోటళ్లు, రిసార్ట్స్‌ను ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) నిర్వహిస్తోంది. అంటే ఆస్తులు పర్యాటక శాఖవైతే...ఆపరేషన్, నిర్వహణ (ఓ అండ్ ఎం) అంతా ఏపీటీడీసీ చూస్తోంది. కొన్ని దశాబ్దాలుగా ఇదే జరుగుతోంది. ప్రభుత్వం కొత్తగా ఏపీటీడీసీ నిర్వహిస్తున్న వాటిని ప్రైవేటు సంస్థలకు దీర్ఘకాలిక లీజుకు ఇచ్చేయాలని నిర్ణయించింది. ఇప్పుడు వస్తున్న ఆదాయం కంటే ఎక్కువ వస్తుందని అంచనాలు ఏమైనా ఉంటే అందులో తప్పు లేదు. కానీ ఇక్కడ చేతికి నికరంగా వస్తున్న ఆదాయంలో 2/3వ వంతు తగ్గిపోతుందని తెలిసినా ఐదేళ్ల నుంచి 33 ఏళ్ల వరకు లీజుకు ఇవ్వడానికి ... మిగతా 8వ పేజీలో



అరకులోయలో వ్యాలీ రిసార్టు

నిర్ణయాత్మక శక్తిగా యువత

- మొత్తం ఓటర్లలో సగం మంది వీరే

- నర్సీపట్నం నియోజకవర్గంలో 2,08,873 మంది ఓటర్లు
- 18-39 ఏళ్ల వయసు వారు 1,02,208 మంది..
- యువతను ఆకట్టుకునే పార్టీలకు గెలుపు అవకాశాలు

నర్సీపట్నం, జనవరి 24:

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో యువ ఓటర్లు నిర్ణయాత్మక శక్తిగా మారనున్నారు. అభ్యర్థుల గెలుపు, ఓటముల్లో కీలకం కానున్నాయి. మొత్తం ఓటర్లలో దాదాపు సగం మంది యువతీయువకులే వుండడం ఇందుకు కారణం. నర్సీపట్నం అసెంబ్లీ నియోజవర్గంలో మొత్తం 2,08,873 ఓటర్లు వున్నారు. వీరిలో పురుషులు 1,01312 మంది, మహిళలు 1,07,556, ఇతరులు ఐదుగురు వున్నారు. కాగా గతంలో 18 నుంచి 35 ఏళ్లలోపు వారిని యువతగా భావించే వారు. అయితే ప్రజల ఆయుః ప్రమాణాలు పెరగడంతో ఐక్య రాజ్యసమితి గత ఏడాది యువత వయసును 39 ఏళ్లకు పెంచింది.



నర్సీపట్నం నియోజకవర్గంలో 18 నుంచి 39 సంవత్సరాల లోపు వయస్సుగల ఓటర్లు 1,02,208 మంది (48.93 శాతం) ఉన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే వివిధ వయసుల వారిలో యువత శాతం అధికంగా వుంటుంది. అందువల్ల వచ్చే ఎన్నికల్లో యువ ఓటర్లు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల గెలుపు/ ఓటముల్లో కీలకం కానున్నారు. కాగా కొత్త ఓటర్లు (18-19 ఏళ్ల వారు) 4,192 మంది ఉన్నారు. ఇక 20 నుంచి 29 ఏళ్లలోపు ఓటర్లు 35,784 మంది, 30 నుంచి 39 ఏళ్ల లోపు ఓటర్లు 62,232 మంది ఉన్నారు. అదే విధంగా 40 నుంచి 49 ఓటర్లు ఏళ్ల లోపు ఓటర్లు 43,019 మంది, 50 నుంచి 59 ఏళ్ల లోపు ఓటర్లు 32,418 మంది, 60 నుంచి 69 ఏళ్ల లోపు ఓటర్లు 20,106 మంది, 70 నుంచి 79 ఏళ్ల లోపు ఓటర్లు 9,102 మంది, 80 నుంచి 89 ఏళ్ల లోపు ఓటర్లు 1,855 మంది, 90 నుంచి 99 ఏళ్ల లోపు ఓటర్లు 160 మంది, వందేళ్లు దాటిన వారు ఒకరు ఉన్నారు.

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

- 7లో



గవరపాలెం గౌరమ్మకు సారె ఊరేగింపు

అనకాపల్లి పట్టణంలోఇన గవరపాలెం గౌరీ పరమేశ్వరుల సారె మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. తొలుత గౌరీ పరమేశ్వరుల వార్షిక కల్యాణాన్ని ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, సింధూజ దంపతులతో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ నిర్వహించారు. సాయంత్రం గవరపాలెంలో అన్ని వీధులకు చెందిన మహిళలు పిండివంటలు, మిఠాయిలను ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఇక్కడి నుంచి ఊరేగింపుగా బయలుదేరి గవరపాలెంతో పాటు చింతావారివీధి, మెయిన్‌రోడ్డు, పరమేశ్వరిపార్కు జంక్షన్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. - 7లో

వివిధ రకాల పిండివంటలు, పసుపు-కుంకుమలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

డీఎఫ్ఓగా జగన్నాథ్‌సింగ్

- నర్సీపట్నంలో బాధ్యతలు స్వీకరణ



ఆర్.జగన్నాథ్‌సింగ్, డీఎఫ్ఓ

నర్సీపట్నం, జనవరి 24: అనకాపల్లి జిల్లా అటవీ శాఖ అధికారి(డీఎఫ్‌వో)గా ఆర్.జగన్నాథ్‌సింగ్ బుధవారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇతను 2013 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి. తొలుత చిత్తూరు డీఎఫ్‌వోగా పని చేశారు. ఈ సమయంలో ఎర్ర చందనం అక్రమ రవాణా నిరోధక విభాగంలో ముఖ్య బాధ్యతలు నిర్వహించారు. తర్వాత నెల్లూరు ఏపీఎఫ్‌డీసీ రిజనల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అక్కడి నుంచి అనకాపల్లి డీఎఫ్ఓగా ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, రిజర్వు ఫారెస్ట్‌లో అక్రమ మైనింగ్, కలప అక్రమ రవాణాను అరికట్టడం, వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేస్తానని అన్నారు. అటవీ భూముల్లో ఆక్రమణలను తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

అన్ని రంగాల్లో భారత్ పురోగతి

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు

- కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్



మహిళకు వంట గ్యాస్ కనెక్షన్ పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి మురళీధరన్, కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి

సబ్బవరం, జనవరి 24: ప్రధాని మోదీ సారథ్యంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ నిలుస్తుందని కేంద్ర విదేశాంగ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఆహార కొరతను అధిగమించి, మిగులు ఉత్పత్తి స్థాయికి భారత్ చేరిందన్నారు. అంతరిక్ష, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించామని చెప్పారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ జిల్లాలో 646 పంచాయతీలు ఉండగా, వికసిత్ భారత్ కార్యక్రమం 616 గ్రామాల్లో పూర్తయిందన్నారు. అనంతరం అర్హులైన పలువురు లబ్ధిదారులకు రుణాలు, సంక్షేమ పథకాలు, వంట గ్యాస్ కనెక్షన్లను కేంద్ర మంత్రి మురళీధరన్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించి అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు జ్ఞాపికతో సత్కరించారు. ఎంపీడీవో రమేశ్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడు, డీపీవో ఆర్.శిరీషారాణి, బీజేపీ పెందుర్తి కన్వీనర్ గొర్లె రామునాయుడు, జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, సెయిల్ డైరెక్టర్ కాశీరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

ఆటోలో నుంచి కిందపడి.. మహిళ మృతి


మృతిచెందిన కృష్ణవేణి

నర్సీపట్నం అర్బన్, జనవరి 24 : మండలంలోని వేములపూడిలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతిచెందింది. రూరల్ ఎస్‌ఐ ధనుంజయనాయుడు తెలిపిన సమాచారం ప్రకారం వేములపూడి గ్రామానికి చెందిన పందిరి వెంకట శివ రామకృష్ణవేణి(58) మంగళవారం సాయంత్రం మరికొంతమందితో కలిసి బయపురెడ్డిపాలెంలో తీర్థానికి వెళ్లింది. ఉత్సవం ముగిసిన తరువాత ఆటోలో తిరిగి వస్తుండగా వేములపూడి పీహెచ్‌సీ సమీపంలో మూడు కుక్కలు ఆటో వెంట పడ్డాయి. దీంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటోలో ఉన్న కృష్ణవేణి తూలిపోయి రోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్రగాయం కావడంతో పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స తరువాత నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పంపారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా దారిలో మృతిచెందింది. భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్దండపురంలో కారు ఢీకొని ఒకరి మృతి

నక్కపల్లి, జనవరి 24: మండలంలోని ఉద్దండపురం హైవే వద్ద బుధవారం రాత్రి 7.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి నక్కపల్లి ఎస్‌ఐ విభీషణరావు తెలిపిన వివరాలివి. తుని నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న కారు ఉద్దండపురం హైవే వద్ద న్యాయంపూడి గ్రామానికి చెందిన ఆకేటి లక్ష్మయ్య(40)ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ చెప్పారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు చెప్పారు.

19 మద్యం సీసాలు స్వాధీనం: ఇద్దరిపై కేసులు

పరవాడ, జనవరి 24: తానాం గ్రామంలోని పాన్‌షాపుల్లో మద్యం అమ్మకాలు సాగిస్తున్న ఇద్దరు వ్యక్తులపై బుధవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. వారి నుంచి 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తానాం గ్రామానికి చెందిన పాలిక వీరునాయుడు షాపు నుంచి 12 మద్యం సీసాలు, అలాగే చీపురుపల్లి సూర్యనారాయణ షాపు నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆ ఇద్దరిపై ఎస్‌ఐ సురేశ్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

- నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్ణయం
- 55 ఆస్పత్రులకు సుమారు రూ.80 కోట్ల వరకూ బకాయి
- ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో
- సేవలు నిలిపివేయాలని నిర్ణయించిన అసోసియేషన్

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు గురువారం నుంచి సేవలు నిలిపివేసేందుకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం వేయి కోట్ల రూపాయలకుపైగా బకాయి ఉంది. ఈ మొత్తాన్ని డిసెంబరు 31లోగా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అయితే బకాయిలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ నిర్ణయించింది. గురువారం ఉదయం నుంచి నెట్‌వర్క్ పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో కొత్తగా రిజిస్ట్రేషన్లు చేయబోమని ప్రకటించింది. పాత కేసులకు మాత్రం యథావిధిగా వైద్య సేవలు అందించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో 55 ఆస్పత్రులు ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి కనీసం రూ.కోటి నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వం బకాయి ఉంది. ఆస్పత్రులన్నింటికీ కలిపితే సుమారు రూ.80 కోట్ల మేర రావలసి ఉంది. గడిచిన ఐదు నెలలు నుంచి బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. బకాయిలపై అదిగో, ఇదిగో అంటూ దాటవేస్తుండడంతో ఆస్పత్రులు సేవలు నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ఈ విషయాన్ని రోగులు గుర్తించి తమకు సహకరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

బీజేపీతో భారత్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు

- కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మురళీధరన్

కొత్తూరు, జనవరి 24: ప్రపంచంలో భారతదేశాన్ని గర్వించే స్థాయికి తీసుకువచ్చిన ప్రధాని మోదీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్ అన్నారు. అనకాపల్లి పట్టణంలోని విజయ రెసిడెన్సీలో శక్తి కేంద్రాల ప్రముఖులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మళ్లీ రానున్నది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి కాశీరాజు, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ సత్యనారాయణ, కార్యదర్శులు వర్మ, పట్టాభి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యల నివారణకు కృషి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారామ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న గొండు సీతారామ్

సబ్బవరం, జనవరి 24 : రాష్ట్రంలో భ్రూణ హత్యల నివారణకు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కృషి చేస్తున్నదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కేజీబీవీలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, బాలికల సంరక్షణ, హక్కులు, వారి ఆరోగ్యం, విద్య, సంక్షేమంపై కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో నిర్విరామంగా కృషి చేస్తున్నామన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. ఆడపిల్లలు స్వేచ్ఛగా జీవించేలా, అభివృద్ధివైపు పరుగులు తీసేలా ప్రోత్సహించడం అందరి బాధ్యత అని అన్నారు. 'బాలికల బంగారు భవితకు అందరం చేతులు కలుపుదాం' పేరిట రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేజీబీవీ ఎస్‌వో మృదుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి, తహసీల్దార్ బి.సత్యనారాయణ, సీఐ పి.రమణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సూర్యనారాయణ, ఎంఈవోలు లక్ష్మణరావు, బీవీఎస్ఎన్ మూర్తి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పద్మావతి, సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలల సమన్వయాధికారి రూపావతి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆయన అంబేడ్కర్ గురుకుల కళాశాలను సందర్శించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

ఘనంగా గవరపాలెం గౌరమ్మకు సారె ఊరేగింపు

- వైభవంగా గౌరీ పరమేశ్వరుల వార్షిక కల్యాణం


ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించిన దృశ్యం


అమ్మవారి ఆలయం వద్దకు భక్తులు తెచ్చిన పసుపు, కుంకుమ

అనకాపల్లి టౌన్, జనవరి 24: స్థానిక గవరపాలెం గౌరీ పరమేశ్వరుల సారె మహోత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. సతకంపట్టులోని గౌరీ పరమేశ్వరులను ఆలయంలో పట్టణ సీఐ జి.శంకరరావు దర్శించుకున్న అనంతరం సారె ఊరేగింపును ప్రారంభించారు. ఉదయం గౌరీ పరమేశ్వరుల వార్షిక కల్యాణం ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, సింధూజ దంపతులతో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ వేద మంత్రాల మధ్య కల్యాణాన్ని నిర్వహించారు.

సాయంత్రం నాలుగు గంటలకు గవరపాలెంలోని వీధి నుంచి మహిళలు ఇళ్ల వద్ద తయారుచేసిన పిండివంటలు, మిఠాయిలను ఆలయం వద్దకు తీసుకువచ్చారు. నాలుగు గంటలకు సతకంపట్టులోని గౌరీ పరమేశ్వరుల ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. తీన్‌మార్ వాయిద్యాలు, తోడపెద్దు సేవతో ప్రారంభమైన ఊరేగింపు గవరపాలెం పురవీధులతో పాటు చింతావారివీధి, మెయిన్ రోడ్డు, పరమేశ్వరిపార్కు జంక్షన్ మీదుగా ఆలయానికి చేరుకుంది.

ఈ ఊరేగింపులో ముత్తాయిదువులు బురెలు, అరిసెలు, గవ్వలు, సున్నిఉండలు, పూతరేకులు, పాల ముంజులు, మురుకులు, జంతికలు వంటి పిండి వంటలతో పాటు అమ్మవారికి పసుపు కుంకుమలు, విభూది లింగం, చీరలు, కూరగాయలు వంటి వాటితో ఊరేగింపు సాగింది.

వైభవంగా జరిగిన సారె మహోత్సవంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహలక్ష్మినాయుడు, నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పీవీ రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, సూరిశెట్టి నరసింగరావు, పెంటకోట జగ ది, వీధి పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరాయి పంచన సబ్ ట్రెజరీ

కోటవురట్లలో పూర్తిగా శిథిలావస్థకు చేరిన భవనం

- వర్షం పడితే శ్లాబ్ నుంచి కారుతున్న నీరు
- తడిసిపోతున్న కంప్యూటర్లు, రికార్డులు, సామగ్రి
- విధుల నిర్వహణకు సిబ్బంది ఇక్కట్లు
- కొత్త భవనం నిర్మాణాన్ని పట్టించుకోని ప్రభుత్వం
- రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ భవనంలోకి కార్యాలయం తరలింపు


శిథిలావస్థకు చేరిన సబ్ ట్రెజరీ కార్యాలయ భవనం



తాత్కాలికంగా అద్దెకు తీసుకున్న విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవనం (ఇన్‌సెట్‌లో) పరాయి పంచన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

కోటవురట్ల, జనవరి 24:

స్థానిక ఉప ఖజానా (సబ్ ట్రెజరీ) కార్యాలయానికి సొంతగూడు కరువైంది. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నూతన భవనం నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో ఉద్యోగులు పరాయి పంచన విధులు నిర్వహిస్తున్నారు.

కోటవురట్ల ఉప ఖజానా కార్యాలయం పరిధిలో కోటవురట్ల, నాతవరం, మాకవరపాలెం మండలాలు వున్నాయి. ఈ మండలాల పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు జీతాలు, పలు రకాల బిల్లులకు సంబంధించిన పనులు ఇక్కడ నుంచే నిర్వహిస్తుంటారు. కాగా ఖజానా కార్యాలయానికి 1985లో నిర్మించిన భవనం కాలక్రమేణా పటుత్వం కోల్పోయింది. గోడలు బీటలు వారాయి. శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం పడితే శ్లాబ్ నుంచి నీరు కారుతున్నది. 15 సంవత్సరాల క్రితం నీలంతుపాన్ ప్రభావంతో భవనం వెనుక గోడ కూలిపోయింది. వర్షం కురిస్తే శ్లాబ్ నుంచి నీరు కారి కంప్యూటర్లు, రికార్డులు తడిసిపోతున్నాయి. సుమారు పది సంవత్సరాల నుంచి ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. భవనం మరమ్మతుల గురించి జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం, కొత్త భవనం నిర్మించకపోవడంతో వేరే భవనంలోకి కార్యాలయాన్ని మార్చాలని ఉప ఖజానా కార్యాలయం అధికారి, ఉద్యోగులు నిర్ణయించుకున్నారు. కాగా మండల కేంద్రంలో విశాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు గతంలో ఒక భవనాన్ని నిర్మించుకున్నారు. సబ్‌ట్రెజరీ అధికారులు నాలుగు నెలల క్రితం రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో మాట్లాడి, కార్యాలయాన్ని ఈ భవనంలోకి తరలించారు. అయితే రెండేళ్లలో కొత్త భవనం నిర్మించుకుంటామని అధికారులు చెప్పడంతో అంతవరకు తమ భవనాన్ని అద్దెకు ఇచ్చామని రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు చెప్పారు.

అధికారుల అనుమతితోనే అద్దె భవనంలోకి

సబ్ ట్రెజరీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. విధులు నిర్వహించడం ఉద్యోగులకు ఇబ్బందికరంగా వుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొత్త భవనం నిర్మించడం ఆలస్యమవుతుందని, అంతవరకు ప్రత్యామ్నాయంగా అద్దె భవనంలోకి కార్యాలయాన్ని మార్చాలని సూచించారు. దీంతో విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ భవనాన్ని అద్దెకు తీసుకున్నాం. త్వరలో కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు చెప్పారు.

- రామారావు, సబ్ ట్రెజరీ అధికారి

టీడీపీ హయాంలోనే బీసీలకు పెద్దపీట

- జయహో బీసీ సభలో మాజీ మంత్రి బండారు


మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

సబ్బవరం, జనవరి 24: టీడీపీ హయాంలోనే రాష్ట్రంలో బీసీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసినట్టు మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడుతూ బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యమిచ్చింది దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పించింది మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రంగాల్లో బీసీలను అణగదొక్కిందన్నారు. బీసీలకు అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను వైసీపీ రద్దు చేసిందని విమర్శించారు. అంతకు ముందు బీసీ నాయకులతో మాట్లాడించి టీడీపీ హయాంలో వారు పొందిన లబ్ధిని తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు బర్నికాన బాబూరావు, గండి రవికుమార్, గండి దేముడు, దొడ్డి ప్రకాశ్, బీసీ జిల్లా సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు, అట్టా సన్యాసిఅప్పారావు, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, దెడ్డప్ప, గవర సత్యనారాయణ, రేసుపూడి రమణ, బంగారునాయుడు, పలు కుల వృత్తుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

బెల్లం తయారీ క్రషర్లలో ఆహార భద్రత అధికారి తనిఖీలు

- పలు క్రషర్లలో బెల్లం నమూనాలు సేకరణ


పిల్లవానిపాలెంలో ఓ రైతు తయారు చేసిన బెల్లం అచ్చును శాంపిల్‌గా తీసుకుంటున్న రవికుమార్

రావికమతం, జనవరి 24: జిల్లా ఆహార భద్రత అధికారి (ఎఫ్ఎస్ఓ) రవికుమార్, సిబ్బంది బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో బెల్లం క్రషర్లలో తనిఖీలు నిర్వహించారు. బెల్లం తయారీలో ఆరోగ్యానికి హాని కలిగించే ప్రమాదకర రసాయనాలు వినియోగిస్తున్నట్టు అందిన ఫిర్యాదులపై బెల్లం క్రషర్లపై దాడులు చేపట్టారు. దొండపూడి, టి.అర్జాపురం, పిల్లవానిపాలెం, కొండెంపూడి, గొర్లెపాలెం తదితర గ్రామాల్లో బెల్లం తయారీ రైతులతో మాట్లాడారు. బెల్లం తయారీకి చెరకు రసంతోపాటు ఏయే రసాయనాలు వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. కొంతమంది రైతులు సరైన సమాధానం చెప్పక పోవడంతో ఆయా రైతులు తయారు చేసిన బెల్లం అచ్చులను శాంపిల్స్‌గా సేకరించారు. పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోనిఇ ల్యాబ్‌కు పంపుతామని రవికుమార్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బెల్లం రంగు ఆకర్షణీయంగా వుండాలన్న కొంతమంది వ్యాపారుల సూచనలు, సలహాలతో రైతులు చెరకు రసంలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలను వాడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో బెల్లం తయారీ క్రషర్లలో తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. సేకరించిన బెల్లం నమూనాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్ పంపామని, హానికర రసాయనాలు వాడినట్టు రిపోర్టులు వస్తే సంబంధిత బెల్లం తయారీదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. హానికర రసాయనాలు వాడకుండా నాణ్యమైన బెల్లం తయారీపై రైతులకు అనకాపల్లిలో అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

డ్వాక్రా మహిళలకు జగన్‌రెడ్డి అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 24 : రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం రాత్రి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 14లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే 79 లక్షల మందికి మాత్రమే ఆసరా సొమ్ము వేయడం దారుణమన్నారు. మిగిలినడ్వాక్రా అక్కా చెల్లెళ్లకు కుచ్చుటోపీ పెట్టారని విమర్శించారు. మహిళల పై కక్షతోనే డ్వాక్రా వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. శ్రీనిధి, ఎన్టీఆర్ బేబికిట్లు, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్, దీపం పథకాలను నాశనం చేశారన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం అమ్మకాలను సాగిస్తూ వేలాది మంది మహిళల మాంగల్యాలను తెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెంచమని వేడుకున్న అంగన్‌వాడీలపై కక్ష కట్టి ఉక్కుపాదం మోపారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు పొదుపు సంఘాలను పెట్టి డ్వాక్రా వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. భవిష్యత్తులో టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే డ్వాక్రా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

న్యాయ వ్యవస్థ సహకారంపై సదస్సు నిర్వహణ భేష్

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య


జస్టిస్ ఎస్.జయసూర్యను సత్కరిస్తున్న 'నల్సార్' వీసీ డి.సూర్యప్రకాశరావు

సబ్బవరం, జనవరి 24: రాజ్యాంగ అభివృద్ధికి న్యాయ వ్యవస్థ సహకారం అనే అంశంపై దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సదస్సు నిర్వహించడం అభినందనీయమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య పేర్కొన్నారు. వర్సిటీలో బుధవారం ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో 'రాజ్యాంగ న్యాయ శాస్త్రానికి భారత న్యాయవ్యవస్థ సహకారం- ఇటీవల పరిణామాలు' అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహిం చారు. ఈ సదస్సులో విద్యార్థులకు జయసూర్య పలు సూచనలు చేశారు. అనం తరం ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి డీవీఎస్ఎస్ సోమయాజులు, హైదరా బాద్ నల్సార్ వర్సిటీ వ్యవస్థాపక వైస్ చాన్సలర్, ఢిల్లీ నేషనల్ లా వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రణబీర్‌సింగ్, గోవా ఐఐయూ-ఎల్ఈఆర్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట్‌రావు ప్రసంగించారు. వారందర్నీ వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సీపీ నందిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేలో ఇబ్బందులు

- తరచూ సర్వర్ మొరాయిస్తుండడంతో సిబ్బందికి అవస్థలు


జీవీఎంసీ జోనల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కులగణన సర్వేకు సంబంధించి సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో సచివాలయ ఉద్యోగులు సర్వే నిర్వహించడానికి ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామున, చీకటిపడిన తర్వాతే సర్వర్ అందుబాటులోకి రావడం వల్ల రాత్రి వేళ ఇంటింటికి వెళ్లి సర్వే చేయడం ఇబ్బందిగా ఉందని సిబ్బంది బుధవారం జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణకు వివరించారు. భీమునిగుమ్మంలో మంగళవారం రాత్రి సర్వే చేస్తుండగా స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని కమిషనర్‌కు వివరించారు. పోలీసులకు కూడా ఈ విషయాన్ని తెలియపరచడంతో పట్టణ సీఐ జి. శంకరరావు సర్వే చేస్తున్న వారిని ఇబ్బంది పెట్టిన వారిని పిలిపించి గట్టిగా మందలించారు. జడ్సీ కూడా సమస్యను సీఐకు తెలియజేశారు. సర్వర్ సరిగా పనిచేయని విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు.

మహిళలను మోసగించిన సీఎం జగన్

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపణ


మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు. పక్కన తెలుగు మహిళలు

అనకాపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహిళలను సీఎం జగన్ మోసగించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పొదుపు సంఘాలు పెట్టి డ్వాక్రా వ్యవస్థను ఏర్పాటు చేస్తే దాన్ని జగన్ నిర్వీర్యం చేశారని విమర్శించారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీలోనూ మోసం చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, కొట్ని ఉమా, వేదుల సూర్యప్రభ, కాయల ప్రసన్నలక్ష్మి, గొర్లి రమణమ్మ, బొబ్బాది రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి పటిష్ఠ చర్యలు: కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 24: జిల్లాలో క్రీడాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. శంకరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న 'ఆడుదాం - ఆంధ్రా' క్రీడా పోటీలు క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఒక వేదికగా పనిచేస్తాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న యువతలో ప్రతిభను గుర్తించి వారికి సంబంధించిన ఆటల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్ పాల్గొన్నారు.

30 మంది ఎస్‌ఐలకు పదోన్నతి

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ పరిధిలో 2009 బ్యాచ్‌కు చెందిన 30 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ రేంజ్ ఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. బూరాడ అప్పలనాయుడు, దుంపల దీనబంధు, ఎస్.సన్యాసినాయుడులను అనకాపల్లి జిల్లాకు, లొద్ద రామకృష్ణ, ఎస్.సోమరాజులను విశాఖ సిటీ, కింతలి నారాయణ రావు, ముదిలి శ్రీనివాసరావు, జి.బాలకృష్ణను విజయనగరం పీటీసీ కళాశాలకు, చింతాడ ప్రసాద్, వి.రమేష్, ఎస్.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరావును శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. కె.మల్లేశ్వరరావు, వి.శంకరనారాయణ, కె.జీవనకాంత్, టి.క్రాంతికుమార్, బి.లక్ష్మణరావు, వి.రామారావు, వి.నారాయణ మూర్తిలను ఇంటెలిజెన్స్‌కు, వి.నాగరాజు, జి.అర్జున, జి.మల్లేశ్వరి, బి.మంగరాజులను సీఐడీకు, ఎ.ప్రసాదరావును మెరైన్ విభాగానికి, బి.అప్పలనాయుడు, కె.కామేశ్వరావులను రైల్వేస్, ఎం.శ్రీనును ట్రాన్స్‌కో, ఎం.చిన్నంనాయుడును ఏసీబీకి కేటాయించారు.

అనకాపల్లి
నియోజకవర్గం

ఓటర్ల హెల్ప్‌లైన్ యాప్ పై అవగాహన సదస్సు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 24 : ఓటర్ల జాబితాలో ఓటరు పేరు, బూత్‌ను గుర్తించే ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌పై అందరికీ అవగాహన కలిగించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు డీఆర్‌వో బి.దయానిధి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటైన సమావేశంలో సూచనలు చేశారు.

పీటీడీ డిపోలో ఘనంగా డ్రైవర్ల దినోత్సవం



గ్యారేజీ సిబ్బందికి బహుమతులు అందిస్తున్న డీపీటీవో పద్మావతి

అనకాపల్లి టౌన్, జనవరి 24 : ఇక్కడి పీటీడీ డిపోలో బుధవారం డ్రైవర్ల దినోత్సవం, గ్యారేజీ నిర్వహణ దినోత్సవాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా డిపోలో మెయింటెనెన్స్ డే కార్యక్రమం నిర్వహించి ఉత్తమ మెకానిక్‌లు ఆర్‌వీ రమణ, కె.వె. నాయుడు, ఎన్.చైతన్యలను సత్కరించారు. వీరికి డీపీటీవో పద్మావతి బహుమతులు అందజేశారు. డిపో మేనేజర్ సుజాత, అసిస్టెంట్ మేనేజర్ రవిచంద్ర, ఏఎంఎఫ్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సీఐ

అనకాపల్లి టౌన్, జనవరి 24 : ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను సూచించారు. పూడిమడక రోడ్డులోని బైపాస్ జంక్షన్ వద్ద బుధవారం వాహనచోదకులకు మోటార్ వాహన చట్టం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'



బాబు ష్యూరిటీ పత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 24 : టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. 81వ వార్డులో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. జగన్‌రెడ్డి తప్పుడు నిర్ణయాలతో అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. రాష్ట్రం నుంచి జగన్‌రెడ్డి, వైసీపీని తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపొందిన వెంటనే అన్ని వర్గాలకు అనుకూలంగా సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. పెరిగిన అన్ని ధరలను అదుపులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామని ఆయన వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ష్యూరిటీ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, రాము, శేఖర్, సూరిబాబు, భాను తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులు ప్రారంభం

కొత్తూరు, జనవరి 24 : సత్యనారాయణపురం పంచాయతీ సూర్యనారాయణ కాలనీలో కాలువ పనులను ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

కొత్తూరు, జనవరి 24 : ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ అనకాపల్లి బ్రాంచ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు పెంటకోట సైదునాయుడు ఎల్ఐసీ హోల్డర్లు, ఏజెంట్లు సమస్యలపై ఈ నెల 28న విశాఖపట్నం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో డివిజన్ జనరల్ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. వెంకట్రావు, సత్యనారాయణ, నాగేష్, సురేష్ పాల్గొన్నారు.

హోం గార్డుల సేవలు అభినందనీయం

- జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ



మృతుడు భార్య షర్మిల దీపికకు చెక్కు అందిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జనవరి 24 : హోంగార్డుల సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. జిల్లాలోని ఎ.కోడూరు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల సురేష్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి హోంగార్డులు అందించిన ఒకరోజు వేతనం సుమారు రూ.నాలుగు లక్షలను ఆయన భార్య షర్మిలదీపికకు ఇక్కడ అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, హోంగార్డులు పాల్గొన్నారు.

పెందుర్తి
నియోజకవర్గం

'అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు తగదు'

పరవాడ, జనవరి 24 : తాడి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 116లో రాంకీ యాజమాన్యం ఫార్మా అదనపు ల్యాండ్‌ఫిల్‌ను ఏర్పాటు చేయడం మానుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు, తాడి మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు బుధవారం ఇక్కడ డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రామస్థులు ఫార్మా కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, ఈ క్రమంలో మరో ఫార్మా కుంపటిని తమ నెత్తిపై పెట్టాలని చూడడం తగదన్నారు. గ్రామాన్ని తరలిస్తామని ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చి ఇరవై నెలలు కావస్తున్నా నేటికీ తరలింపు ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు కోసం ఈ నెల 30న చేపట్టనున్న ప్రజాభిప్రాయసేకరణను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తాడి గ్రామం తరలిపు తర్వాతే అదనపు ల్యాండ్‌ఫిల్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అప్పటి వరకు అదనపు ల్యాండ్‌ఫిల్ ఊసే తమ వద్ద తేవద్దని ఆయన తేల్చిచెప్పారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

... 5వ పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్న విషయాన్ని ప్రజల్లో విస్తతంగా ప్రచారం చేయాలని సూచించారు.

జగనన్న గారు మరచిపోయారా...?

ప్రత్యేక హోదా సాధన కోసం తెలుగుదేశం, వైసీపీ ఎంపీలంతా కలిసి మూకుమ్మడిగా రాజీనామాలు చేద్దామని జగనన్న గత ఎన్నికల ముందు చెప్పి మరచి పోయారని షర్మిల ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో వైసీపీ గెలుపొంది, జగనన్న సీఎం అయిన తరువాత ప్రత్యేక హోదా గురించి ఒక్కసారి కూడా నోరు విప్పలేదని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేయకపోగా కనీసం మాట వరుసకైనా ప్రత్యేక హోదా గురించి కేంద్రాన్ని నిలదీయలేదన్నారు. ప్రత్యేక హోదా పూర్తిగా మూలకు చేరగా, కనీసం ప్రత్యేక ప్యాకేజీ కూడా సాధించలేదని పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. పోలవరానికి 90 శాతం నిధులు ఇస్తామన్న కేంద్రం.. తన మాట నిలుపుకోలేదన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయ్యిందని, చంద్రబాబు ఒక రాజధాని అంటే.. జగనన్న మూడు రాజధానులన్నారని, తీరా చూస్తే రాష్ట్రానికి ఒక్క రాజధానే లేకుండాపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా అనకాపల్లిలో జరిగిన సమావేశంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ ఉపాధ్యక్షుడు మీసాల సుబ్బన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేశ్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ జాతీయ కో-ఆర్డినేటర్ కొప్పుల రాజు, మహిళా నాయకురాలు తాంతియాకుమారి, ఎస్టీ సెల్ చైర్మన్ శాంత కుమారి, ఓబీసీ సెల్ చైర్మన్ మూలా వెంకటరావు, నాయకులు బొడ్డు శ్రీనివాస్, వంతాల సుబ్బరాజు, గోవింద, వేగి దివాకర్, ఎం.కోటేశ్వరరావు, బి.భానుమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులు వినతి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్, తదితరులు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కలిసి సీపీఎస్ రద్దుకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. 12వ పీఆర్సీలో 30 శాతం మధ్యంతర భృతిని కూడా అజెండాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. షర్మిల స్పందిస్తూ... ఈ రెండు విషయాలపై పార్టీ పెద్దలతో చర్చించి అజెండాలో చేరుస్తామని చెప్పారు.

పర్యాటక ప్రాజెక్టులు ప్రైవేటుపరం!

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించారంటే...ఎవరికో ప్రత్యేకంగా లబ్ధి చేకూర్చడానికే అనేది సుస్పష్టం.

నోటిఫికేషన్‌లో ఏమున్నందంటే...?

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక ఆస్తులను లీజుకు ఇచ్చేయడానికి ప్రకటన ఇచ్చింది. అందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి విశాఖపట్నంలోని అప్పుఘర్ వద్ద ఉన్న హరిత రిసార్ట్స్, అనంతగిరి మండలం తైడాలోని జంగిల్స్ బెల్స్, అనంతగిరి రిసార్ట్స్, లంబసింగిలోని రిసార్టులు ఒక ప్యాకేజీలో ఉన్నాయి. ఈ నాలుగింటికి కలిపి ఏడాదికి రూ.3.35 కోట్లు లీజుగా, అక్కడ వచ్చే ఆదాయంలో 24 శాతంవాటా ఇచ్చేలా ఒప్పందం కోసం ప్రభుత్వం ప్రైవేటు పార్టీలను ఆహ్వానించింది.

- అరకులోయలోని మయూరి రిసార్ట్స్, వేలీ రిసార్టులు కలిపి మరో ప్యాకేజీ కింద ప్రకటన ఇచ్చింది. ఈ రెండింటికి ఏడాదికి రూ.4 కోట్ల లీజు మొత్తం, వచ్చే ఆదాయంలో 24 శాతం వాటా ఇవ్వాలనే షరతు పెట్టింది.
- మొత్తం ఆరు రిసార్టులను రూ.7.35 కోట్లు (3.35 కోట్లు+4 కోట్లు) లీజుగా, వచ్చే ఆదాయంలో 24 శాతం వాటా ఇవ్వాల్సి ఉంటుంది

ఇదీ అక్కడ వచ్చే ఆదాయం

- విశాఖపట్నంలోని అప్పుఘర్ వద్ద హరిత రిసార్ట్‌లో 44 రూములు ఉన్నాయి. వీటి ఆధునికీకరణకు రూ.5 కోట్లతో పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. వీటి ద్వారా నెలకు సగటున రూ.40 లక్షల ఆదాయం వస్తోంది. అంటే ఏడాదికి రూ.4.8 కోట్లు. ఇక్కడ ఏపీటీడీసీ 40 మంది సిబ్బందిని ఉపయోగించుకుంటోంది. వారికి జీతాలు చెల్లిస్తోంది.
- అనంతగిరి మండలం తైడా జంగిల్ బెల్స్‌లో 23 రూములు ఉండగా వాటిలో 13 ఆపరేషన్‌లో ఉన్నాయి. అక్కడ నెలకు రూ.25 లక్షల ఆదాయం వస్తోంది. అంటే ఏడాదికి రూ.3 కోట్లు. అక్కడ 25 మంది పనిచేస్తున్నారు.
- అనంతగిరిలో 28 రూములు ఉండగా నెలకు రూ.40 లక్షల ఆదాయం వస్తోంది. ఏడాదికి రూ.4.8 కోట్లు. ఇక్కడ 30 మంది పనిచేస్తున్నారు.
- అరకులోని మయూరి రిసార్ట్‌లో 85 రూములు ఉన్నాయి. నెలకు రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. ఏడాదికి రూ.7.2 కోట్లు. అక్కడ 60 మంది పనిచేస్తున్నారు.
- అరకులోయ వేలీ రిసార్ట్‌లో 45 రూములు ఉన్నాయి. నెలకు రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. అక్కడ కూడా 60 మంది పనిచేస్తున్నారు.
- లంబసింగిలో 15 టెంట్ రూములు ఉన్నాయి. సీజన్‌లో నెలకు రూ.15 లక్షల ఆదాయం వస్తోంది. మొత్తం చూసుకుంటే ఏడాదికి కోటి రూపాయలు వస్తుంది. ఇక్కడ 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

..ఈ లెక్కన చూసుకుంటే వీటన్నింటి ద్వారా ఏడాదికి రూ.28 కోట్ల ఆదాయం వస్తోంది. సిబ్బంది జీతాలకు రూ.8 కోట్లు తీసేస్తే నికరంగా రూ.23 కోట్ల ఆదాయం ఏపీటీడీసీకి మిగులుతోంది. ఇప్పుడు ఇంతకు మించిన ఆదాయం రావాలి. కానీ ప్రభుత్వం టెండర్ ప్రకారం లీజు ద్వారా రూ.7.35 కోట్లు, ఆదాయంలో 24 శాతం (రూ.28 కోట్లలో నాలుగో వంతు) రూ.7 కోట్లు కలిపి సుమారు రూ.15 కోట్లు ఇస్తే చాలని నిబంధనలు పెట్టింది. ఇది కారుచౌక బేరం. ప్రభుత్వ నిర్వహణ కంటే ప్రైవేటు నిర్వహణ బాగుంటుంది కాబట్టి ఇంకా ఎక్కువ ఆదాయం వస్తుంది. వైసీపీకి చెందిన వారికి పర్యాటక ప్రాజెక్టులన్నీ కట్టబెట్టడానికే ఈ ప్రకటన ఇచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రేవుపోలవరం, అనంతగిరి కాఫీ హౌస్ కూడా

అనకాపల్లి జిల్లాలోని రేవుపోలవరం బీచ్‌లో షాక్స్ పేరుతో మూడు రెస్టారెంట్లు ఉన్నాయి. వాటిని కూడా లీజుకు ఇచ్చేస్తామని ప్రకటించారు. ఏడాదికి రూ.7.85 లక్షల అద్దె, వచ్చే ఆదాయంలో 10 శాతం వాటా ఇస్తే...18 ఏళ్లకు లీజుకు ఇస్తామని నోటిఫికేషన్ ఇచ్చారు. అలాగే అనంతగిరిలో కాఫీకి సంబంధించి రీసెర్చ్ డెవలప్‌మెంట్ భవనం ఉంది. దానిని 'కాఫీ హౌస్'గా వ్యవహరిస్తారు. దానిని కూడా ఏడాదికి రూ.1.1 లక్షలకు లీజు నిర్ణయించారు. వచ్చే ఆదాయంలో 10 శాతం అదనంగా ఇస్తే నాలుగేళ్ల లీజుకు ఇస్తామని ప్రకటించారు.

విశాఖలో పీపీపీలో ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం

విశాఖపట్నంలో 5 స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్‌ను పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో నిర్మించి, నిర్వహించడానికి కూడా టెండర్ పిలిచారు. వాస్తవానికి రుషికొండపై ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ రూ.450 కోట్లతో సీఎం క్యాంపు కార్యాలయం మాత్రమే నిర్మించారు. హోటల్, కన్వెన్షన్ సెంటర్లు లేవు. ఇప్పుడు పీపీపీలో నిర్మించడానికి టెండర్లు ఆహ్వానించారు. అయితే అది రుషికొండపైనా, సాగర్‌నగర్‌లో ఉన్న 3 ఎకరాల్లోనా అనేది ప్రకటించలేదు. అయితే ప్రాజెక్టు నిర్మించేందుకు ఇచ్చే భూమికి సబ్ రిజిస్ట్రార్ విలువలో ఒక శాతం లీజుగా, 4 శాతం డెవలప్‌మెంట్ ఫీజుగా, ఆదాయంలో మరో 4 శాతం వాటాగా ఇవ్వాల్సి ఉంటుందని నిబంధన పెట్టారు. ఇలా ఎవరైనా ముందుకువస్తే వారికి 33 ఏళ్లకు లీజు ఇస్తామని ప్రకటించారు.

రత్నాకర్‌ను కలిసిన కూండ్రం నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 24 : కూండ్రం సర్పంచ్ నందారపు సూరిబాబుతో పాటు పలువురు టీడీపీ నాయకులు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు దాడి రత్నాకర్‌ను బుధవారం ఇక్కడ కలిశారు. బొడ్డపాటి చినరాజారావు, వారాది శ్రీను, పచ్చికోరు నరసింగరావు, మాజీ ఉప సర్పంచ్ గనిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పత్రాలు పంపిణీ

అనకాపల్లి టౌన్, జనవరి 24 : జీవీఎంసీ 82వ వార్డులోని మూడు, నాలుగు సచివాలయాల పరిధిలో గల లబ్ధిదారులకు బుధవారం కార్పొరేటర్ మందపాటి సునీత టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు జానకిరామరాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పలకా సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఐ శంకరరావుకు సత్కారం

అనకాపల్లి టౌన్, జనవరి 24 : పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన శంకరరావును బుధవారం పలువురు నాయకులు కలిసి సత్కరించారు. సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ నాయుడు, డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవులు పాల్గొన్నారు.

పాయకరావుపేట
నియోజకవర్గం

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నక్కపల్లి: పెదబోదిగల్లం హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఎంఈవో నరేశ్ బుధవారం పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, ఓటర్ల రాకపోకలకు మార్గాలపై ఆరా తీశారు. హెచ్ఎం సత్యనారాయణ, సీఆర్‌పీ అప్పారావు, తెలుగుపండిట్ ఆచార్యులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించడానికి ప్రజలు సిద్ధం

▸▸ తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత



చినదొడ్డిగల్లులో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న అనిత

నక్కపల్లి, జనవరి 24: మరో మూడు నెలల్లో వైసీపీని గద్దె దించడానికి ప్రజలు సిద్ధమయ్యారని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో బుధవారం టీడీపీ శ్రేణులు అనితమ్మ పల్లె పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఆమెకు నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ టీడీపీ సూపర్ సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వృద్ధులు, మహిళలతో ఎంతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. తల్లీచెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి ప్రజలకు ఏం చేస్తారని ఆమె ప్రశ్నించారు. ఎంతో గుర్తింపు వున్న రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని, అన్యాయాలపై ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. తనపై కూడా చాలా కేసులు పెట్టారన్నారు. గ్రామాల అభివృద్ధి వైసీపీ పాలనలో నిలిచిపోయిందని, కనీసం రహదారులకు మరమ్మతులు కూడా చేయలేని దుర్భర పరిస్థితి నెలకొందని చెప్పారు. అంతకు ముందు గ్రామంలో సత్తెమ్మతల్లి అమ్మవారిని ఆమె దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, నాయకులు వెలగా శ్రీనివాసరావు, ఏజెర్ల వినోద్‌రాజు, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, లాలం కాశీనాయుడు, వి.రమణ, గింజాల లక్ష్మణరావు, కొరిమి సూర్య గణేశ్ పాల్గొన్నారు.

జగన్ ఇచ్చేది గోరంత.. దోచేది కొండంత

▸▸ టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, జనవరి 24: జగన్‌రెడ్డి ఇచ్చేది గోరంత.. ప్రజల నుంచి దోచేది గోరంత అని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమల ద్వారా చంద్రబాబు కోటి మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.20 వేల వరకు లబ్ధి చేకూర్చారని చెప్పారు. జగన్‌రెడ్డి మాత్రం 15 వేలకు తగ్గించి, 50 లక్షల మహిళలకు టోకరా వేశారన్నారు. నాసిరకం మద్యాన్ని మూడు రెట్లు ధర పెంచి విక్రయిస్తూ మందుబాబుల కష్టార్జితాన్ని దోచుకున్నారన్నారు. ఈ మద్యం వల్ల రాష్ట్రంలో లక్షలాది మంది అనారోగ్యానికి గురయ్యారని, 30 వేల మంది మృత్యువాత పడ్డారని ఆయన ఆరోపించారు. జగన్‌రెడ్డి పాలనలో నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులు బతకలేని దుస్థితి దాపురించిందని వాపోయారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా మహిళలపై దాడులు జరిగాయని, అయినా మహిళలను ఉద్ధరించానని జగన్ చెప్పుకోవడం మోసకారితనమని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కులుకులూరు విజయబాబు, మేరుగు బాపునాయుడు, పొన్నమళ్ల కొండబాబు, అప్పలనాయుడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేత పాయకరావుపేట

పాయకరావుపేట, జనవరి 24: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం-ఆంధ్ర నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాయకరావుపేట-2 టీమ్ విజయం సాధించినట్టు ఎంఈవో కేఎస్.గాంధీ తెలిపారు. నాలుగు మండలాల నుంచి నాలుగు టీమ్‌లు పాల్గొనగా ఫైనల్‌లో కోటవురట్లపై పాయకరావుపేట-2 టీమ్ సభ్యులు ఆదిత్య, జయదేవ్ విజయం సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజయ్యపేట జనసేన నూతన కమిటీ ఏర్పాటు

నక్కపల్లి, జనవరి 24: రాజయ్యపేట మత్స్యకార గ్రామం జనసేన నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.కోదండరావు, ఉపాధ్యక్షుడిగా వి.నూకరాజు, కార్యదర్శిగా గోసల అంజి, సంయుక్త కార్యదర్శిగా పి.దేవరాజు, కోశాధికారిగా బి.అప్పలరాజును నియమించినట్టు మండల అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు.

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

పాయకరావుపేట రూరల్, జనవరి 24: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీ డైరెక్టర్ కేవీఎల్‌పీ రాజు చెప్పారు. ఎస్.నర్సాపురం జడ్పీహెచ్ పాఠశాలలో సంస్కార్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పీవీఎస్ఎస్.రాజు, ఎన్.సూర్యనారాయణరాజు, బి.వెంకటపతిరాజు, రామరాజు ఫౌండేషన్ ప్రతినిధి రామరాజు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

షర్మిలను కలిసి కాంగ్రెస్ నాయకులు

పాయకరావుపే/నక్కపల్లి, జనవరి 24: అనకాపల్లి వచ్చిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు బుధవారం కలివారు. నియోజకవర్గంలో త్వరలోనే పర్యటిస్తానని షర్మిల వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జగతా శ్రీనివాస్, ఎం.నారాయణచక్రవర్తి, సూర్యప్రకాష్, మేడేటి శంకర్, చెప్పారు. భూర్తి యేసు, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్‌పర్సన్

ఎలమంచిలి, జనవరి 24: స్వయం సహాయక సంఘాలు ప్రభుత్వ చేయూతతో ఆర్థిక పురోవృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కన్నబాబురాజు సూచించారు. మునిసిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నదన్నారు. చైర్‌పర్సన్ రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కొండలరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, నాయకులు మళ్ల కొండబాబు, కొల్లి త్రినాథ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏటికొప్పాక రహదారి ప్రారంభం



రహదారిని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి

ఎలమంచిలి, జనవరి 24: మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో నూతనంగా నిర్మించిన రోడ్డును ఎంపీ డాక్టర్ బి.సత్యవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రూ.13 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మించినట్టు చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదన్నారు. వీటిని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, జడ్పీటీసీ సభ్యురాలు శానాపతి సంధ్యారాణి, ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, వైసీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, స్థాని నాయకులు ఎస్.రాము, కరణం రవి పాల్గొన్నారు.

ఎలమంచిలి
నియోజకవర్గం

చిత్తడి నేలలను పరిరక్షిద్దాం

▸▸ ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ ఖగేష్

అచ్యుతాపురం, జనవరి 24: భూగర్భ జలాల నిల్వలు పెంపొందించడానికి చిత్తడి నేలలు పరిరక్షించాలని ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.ఖగేష్ సూచించారు. కొండకర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులతో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ చిత్తడి నేలలను పరిరక్షిస్తే పర్యావరణానికి ముప్పు వాటిల్లదన్నారు. భూములను వ్యవసాయేతరానికి ఉపయోగిస్తుండడంతో పర్యావరణంలో సమతుల్యత లోపిస్తోందన్నారు. అంతకుముందు కొండకర్ల నుంచి ఆవ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్‌జీసీ ప్రతినిధులు అన్నాజీరావు, మృత్యుంజయ్, వి.ప్రసాద్, జ్యోతి, శ్యామల పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డొక్కా

మునగపాక, జనవరి 24: టీడీపీ ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మునగపాకకు చెందిన సీనియర్ నేత డొక్కా నాగభూషణం నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తూ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించినందుకు గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

గోకివాడలో ఘనంగా లోవాంబిక తీర్థం

రాంబిల్లి, జనవరి 24: గోకివాడ గ్రామంలో లోవాంబిక అమ్మవారి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. సర్పంచ్ ఎస్ఎస్.సూర్యనారాయణ దంపతులు గ్రామంలోని చిడతలు నేర్చుకున్న 20 మందికి కొత్త చిడతల సెట్లు అందజేశారు. ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, ఎంపీటీసీ సభ్యుడు ఎ.బాబ్జి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ డి.అప్పారావు అమ్మవారిని దర్శించుకున్నారు.

బాలికా సంరక్షణపై అవగాహన ర్యాలీ

రాంబిల్లి, జనవరి 24: మండలంలోని దిమిలి గ్రామంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడ పిల్లను చదివించు.. ఆడ పిల్లను రక్షించు.. అని విద్యార్థులు నినాదాలు చేశారు. వైద్య సిబ్బంది సిహెచ్ ధనరాజు, రాజు మాట్లాడుతూ ఆడబిడ్డ సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. 21 ఏళ్లు నిండిన తర్వాతే వారికి వివాహం చేయాలన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ఎలమంచిలి, జనవరి 24: మండలంలోని పేట బయ్యవరం పాఠశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై హెచ్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరభద్రరావు, రవీంద్ర, ధనలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ కంచాల వితరణ

మునగపాక, జనవరి 24: మండలంలోని అరబుపాలెం పాఠశాలలో విద్యార్థులకు ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు బుధవారం స్టీల్ కంచాలు పంపిణీ చేశారు. రాము మాస్టారు ప్రోత్సాహంతో గ్రామంలో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు మంజుభార్గవి మాట్లాడుతూ చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.శ్రీనివాసరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మహేష్, క్లబ్ కన్వీనర్ సీత, హెచ్ఎం గంగరాజు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

» పలు పాఠశాలల ఉపాధ్యాయులకు ఆర్‌జేడీ జ్యోతికుమారి సూచన



బుచ్చెయ్యపేట ఎమ్మార్సీ భవనంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ

రావికమతం, జనవరి 24 : ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆర్‌జేడీ జ్యోతికుమారి ఉపాధ్యాయులకు సూచించారు. రావికమతం, గొంప హైస్కూళ్లతో పాటు బాలికల హైస్కూల్ గర్నికం కేజీబీవీని బుధారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె టెన్త్ విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించేందుక పలు ప్రశ్నలు వేశారు. పరీక్షలకు ఏవిధంగా సిద్ధమవుతున్నది అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఎ.బి.సి.డి.లుగా విభజించి, చదువులో వెనుకబడిన వారిపై మరింత దృష్టిసారించాలన్నారు. ఇద్దరు ఎంఈవోలు ఉన్నప్పటికీ ఇక్కడ పర్యవేక్షణ కొరవడిందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్జేడీ జ్యోతికుమారి సూచించారు. బుధవారం ఆమె మండలంలోని సీతయ్యపేట జడ్పీ హైస్కూల్, ఎమ్మార్సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీతయ్యపేట పాఠశాలలో విద్యార్థులకు దిశానిర్దేశం చేయడంతో పాటు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అప్పారావు, ఎంఈవోలు విజయలక్ష్మి, బుద్ద కాశీ, హెచ్‌ఎం విష్ణు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలయాల్లో జాతీయ బాలికల దినోత్సవం



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నభారతి

చోడవరం, జనవరి 24 : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నభారతి మాట్లాడుతూ సమాజంలో స్త్రీకి ఉన్నతమైన గుర్తింపు ఉందని, దానిని గుర్తించి బాలికలు స్త్రీ ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు మాల్యాద్రి, సరస్వతి, అధ్యాపకులు సీహెచ్. జ్యోతి, వి.అప్పలనాయుడు, కృష్ణారావు, కోమల, పీడీ మూర్తి, శ్రీనివాస్, తాతారావులతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

రోలుగుంట : బాలికలు తమకు ఉన్న చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి వరలక్ష్మి సూచించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కొవ్వూరు జడ్పీ పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను బాలికలకు ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు గ్రామ సర్పంచ్ కాంతమ్మ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

దేవరాపల్లి, జనవరి 24 : ఓటు హక్కు వినియోగంపై బుధవారం దేవరాపల్లిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఓటరు నమోదు ప్రత్యేకాధికారిణి ఇ.నాగలక్ష్మి, తహసీల్దార్ ఎం.లక్ష్మి, సూపరిండెంట్ జీవీ.రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రెవెన్యూ అధికారులు బుధవారం సాయంత్రం ధర్మసాగరం గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వీటిని ఆర్డీవో జయరాం పరిశీలించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తహసీల్దార్ అన్నాజీరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ సుధావాణి, సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించనున్నామని ఆర్డీవో హెచ్‌వీ జయరాం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి శారదానగర్ మెయిన్ రోడ్డు చివరి వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీనియర్ ఓటర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

టీడీపీ హయాంలో బీసీలకు రాజ్యాధికారం

» నాడు చంద్రబాబు అన్నిరంగాల్లో ఆదుకుంటే.. నేడు జగన్ దగా.. » జయహో బీసీ మహా సభలో నియోజకవర్గ ఇన్‌చార్జి తాతయ్యబాబు



జయహో బీసీ మహా సభలో మాట్లాడుతున్న తాతయ్యబాబు (చిత్రంలో)పరిశీలకులు మూర్తియాదవ్

రావికమతం, జనవరి 24 : బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబుదేనని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, పరిశీలకులు మూర్తియాదవ్ అన్నారు. బుధవారం ఇక్కడ జరిగిన జయహో బీసీ మహా సభలో వారు మాట్లాడారు. చంద్రబాబు హయాంలో బీసీలకు సముచిత స్థానం కల్పించడంతో పాటు రక్షణ చట్టం అమలు చేశారన్నారు. నేడు జగన్ వారికి ఉన్న 34 శాతం రిజర్వేషన్లలో పది శాతం తగ్గించి, అన్ని రంగాల్లో అణచివేస్తున్నారని ఆరోపించారు. నాడు చంద్రబాబు బీసీలకు, చేతివృత్తుల వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రస్తుతం బీసీ కార్పొరేషన్ నిధులను అమ్మఒడి పథకానికి మళ్లించి, బీసీల నోట మట్టికొట్టిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే బీసీలకు రాజ్యాధికారంతో పాటు స్వయ ఉపాధి, రక్షణ చట్టం తీసుకొస్తారన్నారు. జగన్ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలతో పాటు, విద్యుత్ చార్జీలు భారీగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టీడీపీ శ్రేణులు ఈ నాలుగున్నరేళ్లలో వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, అనకాపలి పార్లమెంటరీ సాధికారత సభ్యురాలు బి.లక్ష్మి, నూకరాజు, నాయకులు కోట గోవిందరావు, వెదురుపర్తి వెంకటాచారి, జనసేన మండల అధ్యక్షుడు నాయుడు పాల్గొన్నారు.

'డ్వాక్రా మహిళలకు జగన్ మోసం'

బుచ్చెయ్యపేట : రాష్ట్రంలోని 35 లక్షల మంది డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం అందించకుండా ముఖ్యమంత్రి జగన్ మోసం చేశారని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాత్యబాబు ఆరోపించారు. వడ్డాదిలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమవేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 1.14 కోట్ల మంది డ్వాక్రా మహిళలు ఉండగా 79 లక్షల మందికే జగన్ సర్కార్ ఆసరా అందిస్తూ మిగతా వారిని జగన్ విస్మరించారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పొదుపు మహిళలకు సున్నా వడ్డీ రూ.ఐదు లక్షల వరకు వర్తింపజేశామన్నారు. తాము అధికారంలోకి వస్తే సున్నా వడ్డీ రూ.10 లక్షలకు పెంచుతామని నమ్మించిన జగన్‌రెడ్డి రూ.మూడు లక్షలకు కుదించి మహిళలను దగా చేశారని దుయ్యబట్టారు. జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలు నష్టపోతున్నారని, రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా వైసీపీ ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఆసరా పథకం అందించడంతో సీఎం జగన్ మహిళలను మోసం చేశారని టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్ అన్నారు. బుధవారం కె.కోటపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ఆస్తిహక్కు, 33 శాతం రిజరేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నెన్నో హామీలు ఇచ్చిన జగన్ వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలంతా రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కశిరెడ్డి అప్పలనాయుడు, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, నారాయణమూర్తి, లెక్కల అవతారమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పీవీజీ కుమార్

రైతులకు సాగు భూముల హక్కు పత్రాలు పంపిణీ



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న బూడి

మాడుగుల, జనవరి 24 : మండలంలోని ఆరు గ్రామాల్లో దీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించిన పట్టాలను ఆయా రైతులకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు బుధవారం ఇక్కడ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయంలో ప్రతి పేదవాడికి న్యాయం జరిగిందన్నారు. అంతకు ముందు ఇక్కడి జూనియర్ కళాశాలలో ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రారంభించారు. వైసీపీ మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, తహసీల్దార్ పీవీ రత్నం, ఎంపీడీవో మీనా కుమారి, వైసీపీ నాయకులు బొమ్మిశెట్టి శ్రీను, సర్పంచ్ యడ్ల కళావతిపాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : మండలంలోని ఎం.కోటపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పలువురు ప్రజా ప్రతినిధులతో పాటు సర్పంచ్ శానాపతి శేషఫణి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శానాపతి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : కలిగొట్ల, మారేపల్లిలలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బుధవారం రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలతో పాటు నూతనంగా నిర్మించిన రోడ్లను ప్రారంభించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్‌లు గొర్రుపోటు సుధారాణి, అవుగడ్డ కన్నతల్లి, బూరే బాబూరావు, చింతు రాము తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు భార్యకు ఆర్థిక సాయం అందజేత



షర్మిల దీపికకు చెక్కు అందిస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, జనవరి 24 : హోంగార్డుల సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. ఎ.కోడూరు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల సురేష్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి హోంగార్డులు అందించిన ఒకరోజు వేతనాన్ని ఆయన భార్య షర్మిలదీపికకు అందజేసి మాట్లాడారు. ఏఎస్పీ విజయభాస్కర్, హోంగార్డులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణమూర్తి తీర్థం



స్వామివారి దర్శనానికి వెళ్లి వస్తున్న భక్తులు

దేవరాపల్లి, జనవరి 24 : మండలంలోని పెదనందిపల్లిలో బుధవారం సత్యనారాయణమూర్తి తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు ప్రారంభయ్యాయి. పెదనందిపల్లి, చిన నందిపల్లి, తారువ, మారేపల్లి, మామిడిపల్లి తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. ఎస్ఐ డి.నాగేంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

జైతవరంలో తాళమాంబ ఉత్సవం

చీడికాడ, జనవరి 24 : జైతవరంలో బుధవారం తాళమాంబ తీర్థం ఘనంగా జరిగింది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, కోడూరు గోవింద, డోకల లింగునాయుడు తదితరులు పూజల్లో పాల్గొన్నారు. ఇదిలావుంటే, సాయంత్రం మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, ఎంపీటీసీ పైల ముత్యాలనాయుడు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో దర్శించుకొన్నారు. అనంతరం ఎడ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగగా, విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

కృష్ణాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

బుచ్చెయ్యపేట, జనవరి 24 : వడ్డాదిలోని గొల్లవీధిలో నిర్మిస్తున్న కృష్ణాలయ నిర్మాణానికి గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ రూ.లక్ష విరాళం అందజేశారు. స్థానిక యాదవులు కృష్ణాలయ నిర్మాణానికి సహకరించాలని పల్లా శ్రీనివాస్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి, లక్ష రూపాయిల చెక్కును అందజేసినట్టు వారు తెలిపారు.

షిర్డీసాయి ఆలయానికి ఓ నిరుపేద విరాళం

నర్సీపట్నం, జనవరి 24 : మార్కెట్లో కూలిపని చేసుకుంటూ దాచుకున్న డబ్బును షిర్డీసాయిబాబా ఆలయ నిర్మాణానికి విరాళంగా అందజేశాడు ఓ నిరుపేద. నాతవరం మడలం చెర్లోపాలేనికి చెందిన ఊట శ్రీరామ్మూర్తి పదేళ్లుగా నర్సీపట్నంలో స్థిరపడ్డాడు. కొద్ది కాలం క్రితం సాయిబాబా గుడిలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేశాడు. గుడి పైఅంతస్తులో ఆలయ కమిటీ నిర్మాణం చేసిన జ్ఞాన మందిరిలో రూ.25 వేలఖర్చుతో శివపార్వతుల విగ్రహాలను చేయించాడు. బుధవారం మరో రూ.లక్షను విరాళంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి రామ్‌గోపాల్‌కి అందజేశాడు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ రామచంద్రరావు, ట్రెజరర్ లంక ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

... 5వ పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్న విషయాన్ని ప్రజల్లో విస్తతంగా ప్రచారం చేయాలని సూచించారు.

జగనన్న గారు మరచిపోయారా...?

ప్రత్యేక హోదా సాధన కోసం తెలుగుదేశం, వైసీపీ ఎంపీలంతా కలిసి మూకుమ్మడిగా రాజీనామాలు చేద్దామని జగనన్న గత ఎన్నికల ముందు చెప్పి మరచి పోయారని షర్మిల ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో వైసీపీ గెలుపొంది, జగనన్న సీఎం అయిన తరువాత ప్రత్యేక హోదా గురించి ఒక్కసారి కూడా నోరు విప్పలేదని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేయకపోగా కనీసం మాట వరుసకైనా ప్రత్యేక హోదా గురించి కేంద్రాన్ని నిలదీయలేదన్నారు. ప్రత్యేక హోదా పూర్తిగా మూలకు చేరగా, కనీసం ప్రత్యేక ప్యాకేజీ కూడా సాధించలేదని పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. పోలవరానికి 90 శాతం నిధులు ఇస్తామన్న కేంద్రం.. తన మాట నిలుపుకోలేదన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయ్యిందని, చంద్రబాబు ఒక రాజధాని అంటే.. జగనన్న మూడు రాజధానులన్నారని, తీరా చూస్తే రాష్ట్రానికి ఒక్క రాజధానే లేకుండాపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా అనకాపల్లిలో జరిగిన సమావేశంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ ఉపాధ్యక్షుడు మీసాల సుబ్బన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేశ్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ జాతీయ కో-ఆర్డినేటర్ కొప్పుల రాజు, మహిళా నాయకురాలు తాంతియాకుమారి, ఎస్టీ సెల్ ఛైర్మన్ శాంతకుమారి, ఓబీసీ సెల్ ఛైర్మన్ మూలా వెంకటరావు, నాయకులు బొడ్డు శ్రీనివాస్, వంతాల సుబ్బరాజు, గోవింద, వేగి దివాకర్, ఎం.కోటేశ్వరరావు, బి.భానుమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులు వినతి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్, తదితరులు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కలిసి సీపీఎస్ రద్దుకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. 12వ పీఆర్సీలో 30 శాతం మధ్యంతర భృతిని కూడా అజెండాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. షర్మిల స్పందిస్తూ... ఈ రెండు విషయాలపై పార్టీ పెద్దలతో చర్చించి అజెండాలో చేరుస్తామని చెప్పారు.

పర్యాటక ప్రాజెక్టులు ప్రైవేటుపరం!

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించారంటే...ఎవరికో ప్రత్యేకంగా లబ్ధి చేకూర్చడానికే అనేది చాలా సుస్పష్టం.

నోటిఫికేషన్‌లో ఏమున్నందంటే...?

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక ఆస్తులను లీజుకు ఇచ్చేయడానికి ప్రకటన ఇచ్చింది. అందులో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించి విశాఖపట్నంలోని అప్పుఘర్ వద్ద ఉన్న హరిత రిసార్ట్స్, అనంతగిరి మండలం టైడాలోని జంగిల్స్ బెల్స్ అనంతగిరి రిసార్ట్స్, లంబసింగిలోని రిసార్టులు ఒక ప్యాకేజీలో ఉన్నాయి. ఈ నాలుగింటికి కలిపి ఏడాదికి రూ.3.35 కోట్లు లీజుగా, అక్కడ వచ్చే ఆదాయంలో 24 శాతం వాటా ఇచ్చేలా ఒప్పందం కోసం ప్రభుత్వం ప్రైవేటు పార్టీలను ఆహ్వానించింది.

- అరకులోయలోని మయూరి రిసార్ట్స్, వేలీ రిసార్టులు కలిపి మరో ప్యాకేజీ కింద ప్రకటన ఇచ్చింది. ఈ రెండింటికి ఏడాదికి రూ.4 కోట్ల లీజు మొత్తం, వచ్చే ఆదాయంలో 24 శాతం వాటా ఇవ్వాలనే షరతు పెట్టింది.
- మొత్తం ఆరు రిసార్ట్‌లను రూ.7.35 కోట్లు (3.35 కోట్లు+4 కోట్లు) లీజుగా, వచ్చే ఆదాయంలో 24 శాతం వాటా ఇవ్వాల్సి ఉంటుంది

ఇదీ అక్కడ వచ్చే ఆదాయం

- విశాఖపట్నంలోని అప్పుఘర్ వద్ద హరిత రిసార్ట్‌లో 44 రూములు ఉన్నాయి. వీటి ఆధునికీకరణకు రూ.5 కోట్లతో పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. వీటి ద్వారా నెలకు సగటున రూ.40 లక్షల ఆదాయం వస్తోంది. అంటే ఏడాదికి రూ.4.8 కోట్లు. ఇక్కడ ఏపీటీడీసీ 40 మంది సిబ్బందిని ఉపయోగించుకుంటోంది. వారికి జీతాలు చెల్లిస్తోంది.
- అనంతగిరి మండలం టైడా జంగిల్ బెల్స్‌లో 23 రూములు ఉండగా వాటిలో 13 ఆపరేషన్‌లో ఉన్నాయి. అక్కడ నెలకు రూ.25 లక్షల ఆదాయం వస్తోంది. అంటే ఏడాదికి రూ.3 కోట్లు. అక్కడ 25 మంది పనిచేస్తున్నారు.
- అనంతగిరిలో 28 రూములు ఉండగా నెలకు రూ.40 లక్షల ఆదాయం వస్తోంది. ఏడాదికి రూ.4.8 కోట్లు. ఇక్కడ 30 మంది పనిచేస్తున్నారు.
- అరకులోని మయూరి రిసార్ట్‌లో 85 రూములు ఉన్నాయి. నెలకు రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. ఏడాదికి రూ.7.2 కోట్లు. అక్కడ 60 మంది పనిచేస్తున్నారు.
- అరకులోయ వేలీ రిసార్ట్‌లో 45 రూములు ఉన్నాయి. నెలకు రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. అక్కడ కూడా 60 మంది పనిచేస్తున్నారు.
- లంబసింగిలో 15 టెంట్ రూములు ఉన్నాయి. సీజన్‌లో నెలకు రూ.15 లక్షల ఆదాయం వస్తోంది. మొత్తం చూసుకుంటే ఏడాదికి కోటి రూపాయలు వస్తుంది. ఇక్కడ 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

ఈ లెక్కన చూసుకుంటే వీటన్నింటి ద్వారా ఏడాదికి రూ.28 కోట్ల ఆదాయం వస్తోంది. సిబ్బంది జీతాలకు రూ.8 కోట్లు తీసేస్తే నికరంగా రూ.23 కోట్ల ఆదాయం ఏటీడీసీకి మిగులుతోంది. ఇప్పుడు ఇంతకు మించిన ఆదాయం రావాలి. కానీ ప్రభుత్వం టెండర్ ప్రకారం లీజు ద్వారా రూ.7.35 కోట్లు, ఆదాయంలో 24 శాతం (రూ.28 కోట్లలో నాలుగో వంతు) రూ.7 కోట్లు కలిపి సుమారు రూ.15 కోట్లు ఇస్తే చాలని నిబంధనలు పెట్టింది. ఇది కారుచౌక బేరం. ప్రభుత్వ నిర్వహణ కంటే ప్రైవేటు నిర్వహణ బాగుంటుంది కాబట్టి ఇంకా ఎక్కువ ఆదాయం వస్తుంది. వైసీపీకి చెందిన వారికి పర్యాటక ప్రాజెక్టులన్నీ కట్టబెట్టడానికే ఈ ప్రకటన ఇచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రేవుపోలవరం, అనంతగిరి కాఫీ హౌస్ కూడా

అనకాపల్లి జిల్లాలోని రేవుపోలవరం బీచ్‌లో షాక్స్ పేరుతో మూడు రెస్టారెంట్లు ఉన్నాయి. వాటిని కూడా లీజుకు ఇచ్చేస్తామని ప్రకటించారు. ఏడాదికి రూ.7.85 లక్షల అద్దె, వచ్చే ఆదాయంలో 10 శాతం వాటా ఇస్తే...18 ఏళ్లకు లీజుకు ఇస్తామని నోటిఫికేషన్ ఇచ్చారు.

అలాగే అనంతగిరిలో కాఫీకి సంబంధించి రీసెర్చ్ డెవలప్‌మెంట్ భవనం ఉంది. దానిని 'కాఫీ హౌస్'గా వ్యవహరిస్తారు. దానిని కూడా ఏడాదికి రూ.1.1 లక్షలకు లీజు నిర్ణయించారు. వచ్చే ఆదాయంలో 10 శాతం అదనంగా ఇస్తే నాలుగేళ్ల లీజుకు ఇస్తామని ప్రకటించారు.

విశాఖలో పీపీపీలో ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం

విశాఖపట్నంలో 5 స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్‌ను పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో నిర్మించి, నిర్వహించడానికి కూడా టెండర్ పిలిచారు. వాస్తవానికి రుషికొండపై ఫైవ్ స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ రూ.450 కోట్లతో సీఎం క్యాంపు కార్యాలయం మాత్రమే నిర్మించారు. హోటల్, కన్వెన్షన్ సెంటర్లు లేవు. ఇప్పుడు పీపీపీలో నిర్మించడానికి టెండర్లు ఆహ్వానించారు. అయితే అది రుషికొండపైనా, సాగర్‌నగర్‌లో ఉన్న 3 ఎకరాల్లోనా అనేది ప్రకటించలేదు. అయితే ప్రాజెక్టు నిర్మించేందుకు ఇచ్చే భూమికి సబ్ రిజిస్ట్రార్ విలువలో ఒక శాతం లీజుగా, 4 శాతం డెవలప్‌మెంట్ ఫీజుగా, ఆదాయంలో మరో 4 శాతం వాటాగా ఇవ్వాల్సి ఉంటుందని నిబంధన పెట్టారు. ఇలా ఎవరైనా ముందుకువస్తే వారికి 33 ఏళ్లకు లీజు ఇస్తామని ప్రకటించారు.

నేడు సమస్యలపై పింఛనర్ల ధర్నా

మాకవరపాలెం, జనవరి 24 : పింఛనర్ల సమస్యలపై ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద గల గాంధీ విగ్రహం ఎదుట గురువారం ధర్నా నిర్వహించనున్నట్టు పింఛనర్ల సంఘం మండల అధ్యక్షులు కోసూరు రామరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం పిలుపు మేరకు సమస్యలపై దశలవారీగా పోరాటం చేయనున్నట్టు చెప్పారు. న్యాయపరమైన సమస్యలపై వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమానికి పింఛనర్లంతా హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

చోద్యం హైస్కూల్‌కు కుర్చీలు వితరణ

కృష్ణాదేవిపేట, జనవరి 24 : చోద్యం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు విశాఖపట్టణానికి చెందిన మాతిరెడ్డి భాస్కరరావు బుధవారం ఇరవై కుర్చీలతో పాటు ఇతర సామగ్రిని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదపురెడ్డి ప్రభాకరావు, హెచ్‌ఎం జి.రత్నాజీతో పాటు దాత కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'రాచపల్లి భూములు రీసర్వే చేయాలి'

మాకవరపాలెం, జనవరి 24 : మండలంలోని రాచపల్లి గల భూములు ఆన్‌లైన్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రైతులు బుధవారం విలేకరుల వద్ద వాపోయారు. అన్‌రాక్ కంపెనీ సేకరణలో భూములు కోల్పోయినప్పటికీ మిగులు భూములు 300 ఎకరాలకు నేటికీ ఆన్‌లైన్ కావడం లేదని ఆరోపించారు. దీనిపై అధికారులను పదేపదే కోరినప్పటికీ ఫలితం లేకపోతోందన్నారు. తమ భూములు ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదు కావడంతో ఆన్‌లైన్ చేయలేమని అధికారులు సమాధానం చెప్తున్నారని వివరించారు. భూముల రీ సర్వే కార్యక్రమం జరుగుతున్నప్పటికీ రాచపల్లి గ్రామంలో భూములకు మాత్రం రీసర్వే కావడం లేదని వాపోయారు. అధికారులు ఇప్పటికైనా సస్పందించి భూములు ఆన్‌లైన్ అయ్యేలా చర్యలు చేపట్టాల్సిందిగా వారంతా కోరారు.

'రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు'

చోడవరం, జనవరి 24 : నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.8.34 కోట్లు మంజూరైనట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ పనులకు సంబంధించి 27వ తేదీన టెండర్లు ఆహ్వానించనున్నట్టు చెప్పారు. వచ్చే నెలలో రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తున్నామన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ



పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న సీఐ

రోలుగుంట, జనవరి 24 : రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ సురేష్ బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఎంకే పట్నంలోని పాఠశాలకు వెళ్లి అక్కడున్న 1, 2 పోలింగ్ కేంద్రంలోని వసతులను పరిశీలించారు. విద్యుత్, పర్నీచర్, నీటి వసతి, టాయిలెట్లు, ర్యాంపుల ఏర్పాటు తదితరాలపై ఉపాధ్యాయ సిబ్బంది, అధికారులతో చర్చించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితుడుకి రూ.లక్ష ఆర్థిక సహాయం

నర్సీపట్నం, జనవరి 24 : అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన కుటుంబానికి వాసవీ కల్యాణ మండం కమిటీ, ఎన్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ బుధవారం బాసటగా నిలిచింది. మండలంలోని శివపురంలో నివాసం ఉంటున్న మోటమర్రి శ్రీనివాసరావు ఇంట్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సామగ్రి, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ ప్రతినిధి వెలగానారాయణరావు బాధిత కుటుంబానికి రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీ రాజ్‌కుమార్, పి.కన్నయ్యశెట్టి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం

నర్సీపట్నం అర్బన్, జనవరి 24 : ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలను బుధవారం ఎమ్మెల్యే గణేశ్ ఇక్కడ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, మునిసిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ

కృష్ణాదేవిపేట, జనవరి 24 : ఏఎల్‌పురం హైస్కూల్‌లో ప్రభుత్వం అందించిన వంద ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు గొలుగొండ ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత బుధవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం వి.నాభూషణం, ఎంపీటీసీ ప్రసాద్, ఉపాధ్యాయులు రమేష్, టీవీ రమణ, రామరాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్ సీఐగా హరి బాధ్యతలు



నర్సీపట్నం అర్బన్, జనవరి 24 : నర్సీపట్నం రూరల్ సీఐగా బి.హరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న రమణయ్యను జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోని వీఆర్‌కు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ సందర్భంగా కొత్త సీఐకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

'బ్రాండ్ పేరు చెప్పి కోటా బియ్యం విక్రయం'

మాడుగుల, జనవరి 24 : కోటా బియ్యాన్ని మండలంలోని కేజేపురం జంక్షన్ సమీపంలో గల ఓ ధాన్యం మిల్లులో విక్రయించారని ఒమ్మలి గ్రామానికి చెందిన ఆదిరత్నకుమార్, ఆశీర్వాద్‌లు ఆరోపించారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ ఓ ప్రముఖ బ్రాండ్ పేరుచెప్పి 25 కిలోల కోటా బియ్యాన్ని రూ.12వందలకు విక్రయించారని మిల్లు యజమానిపై వారు మండిపడ్డారు. దీనిపై తాము నిలదీయగా తాను కోటా బియాన్ని అమ్మలేదని చెప్పారన్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పడంతో సదరు యజమానికి కొటా బియ్యాన్ని వెనక్కి తీసుకుని బ్రాండ్ బియ్యాన్ని అందించారన్నారు. దీనిపై సదరు మిల్లు యజమానిని వివరణ కోరాగా, ధాన్యం మిల్లులో ధాన్యం ఆడడం తప్పితే కోటా బియ్యం కొనుగోలు చేయడం, వాటిని అమ్మడం వంటివి ఇక్కడ జరగవన్నారు.

వైసీపీ మాడుగుల అధ్యక్షుడిగా రామధర్మజ

మాడుగుల, జనవరి 24 : వైసీపీ మండల అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ నియామకమయ్యారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు బుధవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. రెండు రోజుల క్రితం రామధర్మజ తన ఎంపీపీ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.